# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

FEBRUARY 2007

సంవత్సర చందా రూ. 50/-

సత్యవాణి ఇప్పుడు 'విస్టా' ఛానెల్ లో కూడ

ప్రతి గురువారం ఉదయం 7:00 గం॥

నుండి 7:30 గం॥ల వరకు చూడండి.

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

సత్యవాణి టి.వి. కార్యక్రమములను

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు
'మా' టి.వి. లోను

ప్రతి గురువారం : 'విస్టా' ఛానల్ లో ఉదయం 7:00
గం॥లకు

ప్రతి శుక్రవారం : KTV లోను, IN లో ఉదయం
7:00గం॥లకు,సాయంత్రం
5:30గం॥లకు (కాకినాడలో మాత్రమే)

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు 'తేజ' ఛానల్
లోను చూడండి

ప్రసంగీకులు : బ్రదర్. జాషువా గూటం
బ్రదర్. లక్కీ గూటం

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు విన్పించండి !!

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 27 | ఫిబ్రవరి 2007 | సంచిక 7


## బైబిలు ఎందు నిమిత్తము వ్రాయబడెను? - 2
## (Why was the Bible Written?)

బైబిలు గ్రంథము మనకు నిజదేవుని గూర్చియు, నిజ రక్షకుని గూర్చియు, మానవుని గూర్చియు బయలుపరచు నిమిత్తము వ్రాయబడెనని గత సంచికలో తెలిసికొని యున్నాము. బైబిలు గ్రంథము మనకు లేనియెడల మోక్ష మార్గమును మనము ఎరుగకపోదుము. అది మానవుని బయలుపరచు నిమిత్తము వ్రాయబడెను గనుక అది పాపమును బయలుపరుచుచున్నది. పాపమనగా ఏమిటో, పాపమువలన మానవుడు దేవుని నుండి ఎట్లు వేరుచేయబడెనో బైబిలు బోధించుచున్నది. "రక్షింపనేరక యుండునట్లు యెహోవా హస్తము కురుచకాలేదు. విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు. మీ దోషములు మీకును, మీదేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను. గనుక ఆయన ఆలకింప కున్నాడు" అని యెషయా 59:1-2 లో వ్రాయబడెను. సృష్టికర్త యైన దేవుని

నుండి పాపము వలన మానవుడు వేరుచేయబడెను.

బైబిలు లేనియెడల పాపము యొక్క నిజస్థితిని మనము అర్ధము చేసికొన లేము. మన పాపములు మనకును, దేవునికిని అడ్డుగోడవలె యుండెనను సంగతిని మనము ఎరుగము. "కాబట్టి యేమందుము? ధర్మశాస్త్రము పాప మాయెనా? అట్లనరాదు. ధర్మశాస్త్రము వలననేగాని పాపమనగా ఎట్టిదో నాకు తెలియకపోవును. ఆశింపవద్దని ధర్మశాస్త్రము చెప్పని యెడల దురాశ యన ఎట్టిదో నాకు తెలియకపోవును" అని అపొ.పౌలు రోమా 7:7లో వ్రాసెను. ధర్మశాస్త్రము వలన పాపమనగా ఎట్టిదో తెలియబడుచున్నది యని అతడు చెప్పెను (రోమా 3:20).

పాపమనగా యేమిటి? అపొ.యెహాను దానిని క్లుప్తముగ ఇట్లు నిర్వచించెను: "పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞను అతిక్రమించును; ఆజ్ఞాతిక్రమమే పాపము" (1 యోహాను 3:4). దేవుని ఆజ్ఞను ఉల్లంఘించుట లేక అతిక్రమించుటయే పాపము. మానవునికి మేలైనది ఏదో దేవుడెరుగును. అందువలన ఆ మేలైన మార్గమునందు మానవుడు నడుచు కొనునట్లు దేవుడు ఆజ్ఞల నిచ్చెను. అయితే మానవుడు తన స్వేచ్ఛను వినియోగించి దేవుని ఆజ్ఞలను ఉల్లంఘించును. అది పాపము, "ఏలయనగా ధర్మశాస్త్రము లేని యెడల అతిక్రమము లేకపోవును" అని పౌలు చెప్పెను (రోమా 4:15). "సకల దుర్నీతియు పాపము" అని యోహాను మరల వ్రాసెను (1 యోహాను 5:17). పాపమనగా దేవుడు నిషేధించిన దానిని చేయుట మాత్రమేగాక ఆయన చెప్పినది చేయకపోవుటయు కూడ పాపము అని దైవవేదము బోధించుచున్నది. భక్తుడైన యాకోబు ఇట్లు వ్రాసెను: "కాబట్టి మేలైనది చేయనెరిగియు ఆలాగుచేయని వానికి పాపము కలుగును" (యాకోబు 4:17). గనుక ఇట్టి విధముగా పాపమును బైబిలు బయలుపరచు చున్నది. బైబిలును మన ఆత్మీయ అద్దమువలె వర్ణింపవచ్చును. ఆ యద్దములో ప్రతి మానవుడు తాను నిజముగా ఎట్లున్నాడో చూచుకొన వచ్చును (యాకోబు 1:23-25). మన ఒక్కొక్కరికి పాపమును దేవుని వాక్యము ఎత్తి చూపించుచు, దేవుని దృష్టికి మన మెట్లగుపడుచున్నామో మనకు తెలియజేయు నిమిత్తము బైబిలు

వ్రాయబడియున్నది.

పాపము వలన వచ్చు జీతము మరణము అని బైబిలు బోధించుట మాత్రమే గాక, దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసునందు నిత్యజీవము అని అది బోధించుచున్నది (రోమా 6:23). అందువలన మానవులు పాపము నుండి విముక్తి నొందుట యెట్లో తెలియజేయుటకు బైబిలు లిఖింపబడియున్నది. మానవుడు నిత్యరక్షణ నొందవలెనంటే అతడేమి చేయవలెనో బైబిలు బోధించుచున్నది. మానవుడు తన్ను తాను రక్షించుకొనలేని స్థితిలో యుండెను గనుక దేవుని నుండి అట్టి ప్రత్యేక బయల్పాటు అతనికి అవుసరము. "తన మార్గము నేర్పరచుకొనుట నరుల వశములో లేదనియు, మనుష్యులు తమ ప్రవర్తనయందు సన్మార్గమున ప్రవర్తించుట వారి వశములో లేదనియు నేనెరుగుదును" అని యిర్మియా ప్రవక్త వ్రాసెను. అందువల్లనే పాపములోబడి నశించిపోవుచున్న మానవులకు రక్షణ మార్గమును ప్రకటించుచు యేసుక్రీస్తు ఈలోకమునకు వచ్చెను. "పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు, పూర్ణాంగీకారమునకు యోగ్యమునై యున్నది. అట్టివారిలో నేను ప్రధానుడను'' అని అపొ.పౌలు వ్రాసెను. (1 తిమోతి 1:15).

యేసుక్రీస్తు అనుగ్రహించు రక్షణను మనము చేపట్టవలెనన్న, పాపము నుండి విముక్తి పొందవలెనన్న, మనము యేసుక్రీస్తు దేవుని కుమారుడు అని నమ్మవలెను (యోహా 8:24), మన పాపముల విషయమై మారు మనస్సు పొందవలెను (లూకా 13:3), యేసు దేవుని కుమారుడని మన నోటితో ఒప్పుకొనవలెను (మత్తయి 10:32), మరియు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెను. (అపొ.కా. 2:38). దేవుని యందును, క్రీస్తు యేసునందును మనకు గల విశ్వాసమును ఆయన ఆజ్ఞలకు విధేయత చూపుట ద్వారా నిరూపించుకొనవలెనని దైవవేదము చెప్పుచున్నది. "ఆయన, కుమారుడైయుండియు తాను పొందిన శ్రమలవలన విధేయత నేర్చుకొనెను...తనకు విధేయులైన వారి కందరికిని నిత్యరక్షణకు కారకుడాయెను'' అని హెబ్రీ 5:9,10లో వ్రాయబడియున్నది. గనుక రక్షణ మార్గమును మనకు తెలియజేయు

నిమిత్తము బైబిలు వ్రాయబడి యున్నది.

యేసుక్రీస్తు స్థాపించిన ఒకే ఒక్క సంఘమును గూర్చి మనకు తెలియజేయు నిమిత్తము కూడ బైబిలు వ్రాయబడి యున్నది. ఈనాడు క్రైస్తవ లోకములో అనేక డినామినేషనులు ఉన్నవి. అయితే మొదటి శతాబ్దపు క్రైస్తవులు అట్టి మతశాఖల నేమియు ఎరుగరు. సరిగదా క్రొత్తనిబంధన, క్రైస్తవులలో చీలికలను ఖండించెను. మనము క్రొత్త నిబంధనను జాగ్రత్తగా చదివిన యెడల బైబిలు బోధించు సంఘమును గూర్చి అంతయు విపులముగా తెలిసికొనగలము.

"నా సంఘమును నేను కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేరవు" అని క్రీస్తు బోధించెను (మత్తయి 16:18). క్రీస్తు వాగ్దానము చేసిన సంఘము పెంతెకొస్తుదినమున, యెరూషలేములో ఆరంభమాయెనని అపొ.కా. 2వ అధ్యాయము మనకు తెలియజేయుచున్నది. ఆ సంఘమునకు శిరస్సు యేసుక్రీస్తు అని బైబిలు మనకు తెలియజేయుచున్నది. "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్న లాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు" అని ఎఫెసీ 5:23లో వ్రాయబడి యున్నది. సంఘమునకు శిరస్సుగా క్రీస్తు యుండగా, సంఘము ఆయన శరీరము అని వర్ణించబడినది. "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యము కలుగు నిమిత్తము ఆయన ఆదియైయుండి మృతులలో నుండి లేచుటలో ఆది సంభూతుడాయెను" అని కొలస్స 1:18లో వ్రాయబడియున్నది. గనుక సంఘమును క్రీస్తునుండిగాని, క్రీస్తును సంఘము నుండిగాని మనము వేరు చేయలేమని దీనివలన మనము గ్రహించ కొనగల్గుచున్నాము. సంఘమునకు ఆయనే రక్షకుడు. సంఘమునకు పునాది యేసుక్రీస్తే అనియు, ముఖ్యమైన మూలరాయి క్రీస్తే అనియు బైబిలు బోధించుచున్నది (1 కొరింథి 3:11; ఎఫెసీ 2:20). గనుక మనము బైబిలును చదువుకొలది అందు బయలుపరచబడిన సంఘము ఒకే ఒక్కటియని, అది క్రీస్తు సంఘమని తెలిసికొనగలము. అంతేకాదు, రక్షింపబడిన ప్రతివారిని ప్రభువు తన సంఘముతో చేర్చుచుండెను అని అది బోధించుచున్నది. క్రీస్తు సంఘమునకు వెలుపలయుండి రక్షణ పొందుట అసాధ్యమని దీనివలన నిర్ధారణయగుచున్నది. సువార్తను నమ్మి

బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును అని క్రీస్తు చెప్పెను (మార్కు 16:16). సువార్తకు అట్లు లోబడినవారిని ప్రభువే తన సంఘముతో చేర్చుకొనును అని బైబిలు మనకు తెలియజేయుచున్నది.

సువార్తకు లోబడి క్రైస్తవులమయిన తరువాత మనము పవిత్రమును, నిష్కళంకమునైన జీవితమును జీవించవలెనని మనకు తెలియజేయు నిమిత్తము బైబిలు వ్రాయబడి యున్నది. "ఏలయనగా సమస్త మనుష్యులకు రక్షణకరమైన దేవుని కృప ప్రత్యక్షమై మనము భక్తిహీనతను, ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి, శుభప్రదమైన నిరీక్షణ నిమిత్తము, అనగా మహాదేవుడును, మన రక్షకుడునైన యేసుక్రీస్తు మహిమ యొక్క ప్రత్యక్షత కొరకు ఎదురుచూచుచు, ఈ లోకములో స్వస్థబుద్ధితోను, నీతితోను, భక్తితోను బ్రతుకుచుండవలెనని మనకు బోధించు చున్నది" యని తీతు 2:11-13లో వ్రాయబడెను. "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును, దేవునికి అనుకూలము నైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించు కొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను, ఇట్టి సేవ మీకు యుక్తమయినది. మీరు ఈ లోక మర్యాదను అనుసరింపక, ఉత్తమమును అనుకూలమును, సంపూర్ణమునైయున్న దేవుని చిత్తమేదో పరీక్షించి తెలిసికొనునట్లు మీ మనస్సు మారి నూతనమగుట వలన రూపాంతరము పొందుడి" యని రోమా 12:1-2లో పౌలు క్రైస్తవులను హెచ్చరించెను.

బైబిలు మానవునియొక్క ఆధ్యాత్మిక తృష్ణను తీర్చుట కొరకు అనేక సంగతులను గూర్చి బోధించుచున్నది. మానవునియెడల దేవుని చిత్తము అందు బయల్పరచబడినది. బైబిలు ఎందు నిమిత్తము వ్రాయబడెనో క్లుప్తముగ కొన్ని కారణములను మీకు చూపించితిని. దేవుని చిత్తమును పూర్ణముగా ఎరుగు నిమిత్తము మీ బైబిలును దీర్ఘముగా పఠించుడి; పఠించుట మాత్రమే గాక ఆ గ్రంథముద్వారా దేవుడు మీ కిచ్చు ఆజ్ఞలకు లోబడుటకు త్వరపడవలెనని నా ప్రేమ పూర్వక హెచ్చరిక!

– జాషువా గూటం

# సంఘారాధన

## (Worship of the Church)

రక్షణ పొందిన వారితో సంఘము సమకూర్చబడియున్నది. యేసుక్రీస్తు ద్వారా దేవుని సేవించి, ఆరాధించుటయే దాని ముఖ్యోద్దేశమై యున్నది. పౌలు ఇట్లు చెప్పెను: "మరియు మాటచేత గాని, క్రియచేతగాని మీరేమి చేసినను ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడి" (కొలస్స 3:17).

క్రొత్త నిబంధనలో మూడురకములైన ఆరాధనలు కన్పడుచున్నవి. మొదటిది, తెలియని ఆరాధన. పౌలు ఏథెన్సు పట్టణములోయున్న అనేక విగ్రహము లను చూచి ఇట్లు చెప్పెను: "నేను సంచరించుచు మీ దేవతా ప్రతిమలను చూచుచుండగా ఒక బలిపీఠము నాకు కనబడెను. దానిమీద తెలియబడని దేవునికి అని వ్రాయబడియున్నది. కాబట్టి మీరు తెలియక దేనియందు భక్తి కలిగియున్నారో దానినే నేను మీకు ప్రచురపరచుచున్నాను" (అపొ.కా. 17:23). తెలియని ఆరాధనను జరిగించువారు ఆనాడు, ఈనాడు కూడ కొందరు కలరు. లక్షలాది ప్రజలు విగ్రహములకు, ప్రతిమలకు మ్రొక్కుట మాత్రమే గాక, వేలకొలది ప్రజలు లేఖనములు నెరుగక అనేక మతాచారములకు లోబడియున్నారు.

రెండవది, వ్యర్థారాధనను గూర్చి బైబిలు బోధించుచున్నది. "మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారునన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" అని క్రీస్తు చెప్పెను (మత్తయి 15:9). ప్రజలలో అనేకులు ఈనాడు దేవుని వ్యర్థముగా ఆరాధించు చున్నారు. వారు ప్రభువునే ఆరాధించు చున్నారన్న మాట నిజమే, కాని వారి ఆరాధన దైవచిత్తము ననుసరించి యుండనందునను, మానవ కల్పిత సిద్ధాంతములపైనను, ఉపదేశముల చొప్పున ఉండుటవలనను, అది వ్యర్థము. అట్టిది ప్రయోజన శూన్యమైనది.

మూడవది, సత్యారాధనను గూర్చి బైబిలు బోధించుచున్నది. అది

ఆత్మతోను, సత్యముతోను కూడినదై యున్నది. "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను" అని క్రీస్తు పలికెను (యోహాను 4:24). దేవుడు అంగీకరించు ఆరాధన ఇది ఒక్కటి మాత్రమే. క్రీస్తు దినములలోను, ఇప్పుడు మన దినములలోను ఇది నిజము. ఆత్మవలన దేవుని తట్టు జరిగించు ఆరాధన ఇది. వినయముతో భావ సహితమై యుండి సత్య లేఖనముల ననుసరించి యుండు ఆరాధన ఇది. ఆరాధన చేయుమని దేవుడు ఎవరినీ బలవంతము చేయుడు. కాని ఆయన నారాధించువారు ఆయన చెప్పునట్లు చేయవలెను.

క్రీస్తు సంఘము చేయవలసిన ఆరాధన యెట్టిది? అది తెలియని ఆరాధనా? కానేకాదు. మానవకల్పిత బోధనల ననుసరించుయన్న ఆరాధనా? అంతకు ముందేకాదు. కాని అది ఆత్మతోను, సత్యముతోను యుండి దేవుని కంగీకారమైనదై యుండవలెను. మనము క్రొత్త నిబంధనను చదువుచుండగా అందున్న ఆజ్ఞలు మూలముగను, మాదిరిని బట్టియు చూచిన అదిమ సంఘము ఈక్రింది 5 అంశములను ఆరాధనలో జరిగించినట్లు కనుగొందుము:

1. వాక్యము చదువుటకు వారు కూడుకొనిరి. పరిశుద్ధ లేఖనములను తిమోతి బాల్యము నుండియు ఎరిగినను (2 తిమో 3:15), "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగ ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్త పడుము" అని పౌలు హెచ్చరించెను. ఇది క్రైస్తవులందరికీ, మరి ముఖ్యముగ ఆరాధనకు కూడివచ్చిన వారికి వర్తించును. వాక్యము ద్వారా దేవుడు తన బిడ్డలతో మాటలాడు సమయమిది. అపొస్తలులు కార్యములు 20:7లో సహోదరులకు పౌలు ప్రసంగించుట ద్వారా వాక్యమును బోధించినట్లు గ్రహించగలము.

2. వారు ప్రార్థనచేసిరి. పెంతెకోస్తు దినమున సువార్తకు లోబడినవారు "అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టెవిరుచుట యందును,

ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి" (అపో.కా.2:42). ప్రార్థన ద్వారా దేవుని బిడ్డలకు పరలోకమందున్న తండ్రితో మాటలాడుతరుణము దొరకుచున్నది. క్రైస్తవులు ఆరాధనకు కూడి వచ్చినప్పుడు ప్రార్థన చేయకపోవుట జరుగదు.

3. వారు కీర్తనలు పాడిరి. పౌలు తన సహోదరులకు ఇట్లు వ్రాసెను: "ఒకని నొకడు కీర్తనలతోను, సంగీతములతోను, ఆత్మసంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు, కీర్తించుచు దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి" (ఎఫెసీ 5:19). మరియు కొలస్స 3:16, హెబ్రీ 13:15లను చదువుము. రెండు రకములైన సంగీతము కలదు. ఒకటి గాత్రము, రెండవది జంత్రము. అయితే దేవుడు కోరునట్టి సంగీతమేది? మనము హృదయములలో ప్రభుని గూర్చి గానము చేయవలెనని పౌలు చెప్పుచున్నాడు. గనుక ఇది వాయిద్య సంగీతమును బహిష్కరించును. మొదటి క్రైస్తవులు స్తుతిగానములను పాడిరి. అనేక శతాబ్దములు తరువాత మానవులు వాయిద్యములను ఆరాధనలో ప్రవేశపెట్టిరి. అది దేవునిచే ఏర్పాటు చేయబడలేదు. దేవుడు దానిని అంగీకరించడు. క్రైస్తవులు వాయిద్య సంగీతముతో ఆరాధన చేసి దేవుని స్తుతించలేదు.

4. వారు ప్రభురాత్రి భోజనము పాలుపుచ్చుకొనుటకు కూడుకొనిరి. అపో.కా. 20:7లో దీని మాదిరి మనకొకటి యున్నది. మత్తయి 26:26-28 లోను, 1 కొరింథి 11వ అధ్యాయములోను, మనము రొట్టెను క్రీస్తు శరీరమునకు జ్ఞాపకార్ధముగాను, ద్రాక్షరసమును క్రీస్తు రక్తమునకు జ్ఞాపకార్ధముగాను చేయవలెనని వ్రాయబడియున్నది. నేడు మనము కూడ దీనిని అట్లు జరిగించవలెను.

5.వారు కానుకలనిచ్చిరి. గలతీయ లోను, కొరింధులోను ఉన్న సహోదరులను పౌలు ఇట్లు హెచ్చరించెను: "నేను వచ్చినప్పుడు చందాపోగుచేయకుండా ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను" (1 కొరింధీ 16:2). 2 కొరింధి 9:7ను కూడ చదువుము.

అదిమ క్రైస్తవులు దేవుని నారాధించుటకు ఆదివారమున కూడుకొనిరి (అపొ.కా.20:7,1 కొరింథి 16:2). "కొందరు మానుకొను చున్నట్లుగా సమాజముగా కూడుట మానక, ఒకని నొకడు హెచ్చరించుచు, అ దినము సమీపించుట మీరు చూచినకొలది మరి యెక్కువగా అలాగున చేయుడి" యని వారు హెచ్చరింపబడిరి (హెబ్రీ 10:24,25). నేటి క్రైస్తవులు కూడ ఆదివార దినమున ఆరాధన చేయవలెను గనుక ఈ హెచ్చరిక వారికిని వర్తించును.

సంఘారాధన బహు సులభమైనది గనుక అనేకులు తడబడుచున్నారు. అది పూజలతోను, పునస్కారములతోను, మానవ కల్పిత ఆచరణలతోను, ఆడంబరముతోను ఉండవలెనని వారనుకొందురు. అయితే అది అట్లు లేదు. ఆరాధనను గూర్చి దేవుడు తన చిత్తమును తన గ్రంథమందు బయలు పరచెను. దానిని ఇసుమంతయును మార్చుటకు మానవునికి సెలవులేదు. దేవుని శాపమునకు గురికాకుండగా దానికి కలుపుటగాని దానినుండి తీసివేయుటగాని జరుగనేరదు. దేవుడే మాట్లాడెను గనుక ఆయన ప్రజలు ఆయనకు లోబడవలెను. అప్పుడు మాత్రమే మనము దేవుని స్తుతించి, మహిమపరచి, ఆరాధించగలము.

—జె.సి. ఛోట్

సత్యవాణి - క్రీస్తు సంఘము ద్వారా ఉచితంగా ఇయ్యబడుచున్న బైబిలు కరస్పాండెన్సు కోర్సులో మీరు, మీ సంఘ సభ్యులు చేరండి. అపాఠములను మీయింటిలోనే పూర్తిచేసి తెలుగు బైబిలును ఉచితముగా పొందండి.
ఈ రోజే మాకు వ్రాయండి.

SATYAVANI, P.O.Box-80 KAKINADA - 533 001.

గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు
50/-రూ॥లు చందా విధిగా పంపించవలయును.

## తలుపు తీసియుంచబడిన సంఘము - ఫిలదెల్ఫియ

(The Church of the Open Door - Philadelphia)

(ప్రకటన 3:7-13)

**ఉపోద్ఘాతము:**

క్రీ॥పూ 140లో అట్టాలస్ II అనునతడు ఫిలదెల్ఫియ పట్టణమును స్థాపించెను. యూమెనెస్ అను తన సహోదరుని అతడు ప్రేమించాడు, అతన్ని ఫిలదెల్ఫోస్ అని పిలిచేవాడు. సహోదరుని ప్రేమించేవాడని ఆమాట యొక్క అర్థం. అందువలన ఆ పట్టణం ఫిలదెల్ఫియ అని నామకరణం చేయబడింది.

1. అపో.పౌలు తన సువార్త యాత్రలలో క్రీ॥శ 45-58 మధ్య ఇక్కడ సంఘాన్ని స్థాపించాడని కొందరి భావన

2. గ్రీకు భాషను సంస్కృతిని వ్యాప్తిచేయడానికి ఫిలదెల్ఫియ పట్టణం స్థాపించబడింది. అదొక చిన్న ఏథెన్సుపురం!

3. ఔషధపూర్వకమైన నీటి ఊటలు ఆ పట్టణంలో యుండేవి.

4. అక్కడ భూమి బహుసారవంతమైనది. క్రీ॥శ 17లో ఆ పట్టణం భూకంపము వలన నాశనమాయెను. తిబెరెయ కైసరు వలన ఆ పట్టణం మరల కట్టబడింది. అందువలన కైసరులకు ఈ పట్టణానికి ప్రత్యేక సంబంధం వుండేది.

5. ఫిలదెల్ఫియలో సంఘము చాల చిన్నది. యూదులు దాని శత్రువులు, రోమీయుల వలన, దేవతార్చన చేయువారి వలన వారికి శ్రమలు లేవు.

6. స్ముర్ణలోని సంఘము వలె ఈ సంఘాన్ని ప్రభువు అభినందించారు.

**I. క్రీస్తు యొక్క వర్ణన: (7వ)**

A. 1. క్రీస్తు పరిశుద్ధుడని వర్ణించబడెను. పరిశుద్ధుడనగా పాపము నుండి ప్రత్యేకముగా నున్నవాడని యర్థము. ప్రతిష్ఠింపబడినవాడు, పవిత్రమైనవాడు. ఆయన పరిపూర్ణ పరిశుద్ధుడు. కీర్తన 16:10; అపో. కా. 2:27;13:35

2. ఆయన పాపము నుండి దూరముగా యున్నవాడు (యోహాను 8:46; I పేతురు 2:22; I యోహాను 3:5).

B. క్రీస్తు సత్య స్వరూపియైనవాడు. ఆయన యదార్థవంతుడు, నకిలీ యేమిలేదు. పరలోకమునుండి దిగి

వచ్చిన జీవాహారము ఆయనే (యోహాను 6:32). ఆయనే నిజమైన ద్రాక్షావల్లి (యోహా 15:1). సత్యవంతుడైన ఆయన యందు మనమున్నామని యోహాను చెప్పెను (యోహా 5:20). క్రీస్తు సత్యం! ఆయన అసత్య క్రీస్తుకాదు, అబద్ధ దేవుడు కాదు. ఆయన శరీరాకారములో యున్న దేవుడు (యోహాను 1:14). సత్యస్వరూపి, పరిశుద్ధుడు అనునవి దేవుని లక్షణాలు (యెషయా 6:3; 1థెస్స1:9).

C. "క్రీస్తు దావీదు తాళపుచెవి కలిగి యెవడును వేయలేకుండతీయువాడును, ఎవడును తీయలేకుండ వేయువాడు".

1. యెషయా 22:22లో ఈ మాటలు చెప్పబడెను. హిజ్కియాకు నమ్మకమైన సేవకుడగు ఎల్యాకీముకు దావీదు యింటి తాళములు ఇయ్యబడిన సందర్భము యిది. దేవుడే ఆ పని చేసెను. రాజగృహములోనికి ఎవడును ప్రవేశింపకుండాచూచు అధికారము ఎల్యాకీముకు ఇయ్యబడెను. ప్రవేశిస్తే అతని అనుమతిని బట్టే ప్రవేశించాలి.

2. క్రీస్తు కూడ దావీదు తాళపుచెవి కలిగి యుండెను. లూకా 1:32-33లో "ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయన కిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగయుగములు ఏలును; ఆయన రాజ్యము అంతము లేనిదై యుండునని" చెప్పబడెను. యిది యెషయా 9:6,7లో ముందుగనే ప్రవచింపబడెను.

3. క్రీస్తు ఈ తాళపుచెవిని అపొస్తలుల కిచ్చెను (మత్తయి 16:18, 18:18). ఈ తాళములతో వారు పరలోక ద్వారములు పెంతెకొస్తునాడు తెరిచిరి. పునరుత్థానుడైన తరువాత ఇహపరములయందు క్రీస్తుకు సర్వాధికారమియ్యబడెను (మత్తయి 28:18). క్రీస్తు మరణము యొక్కయు పాతాళము యొక్కయు తాళములను కలిగి యున్నారు (ప్రకటన 1:17-18).

4. పరలోకంలో దేవుని సన్నిధానమునకు ప్రవేశింపజేయడానికి తీర్పరివలె క్రీస్తుకు అధికారమున్నది (యోహా 5:22). "నేనేమార్గమును, సత్యమును జీవమును, నాద్వారానే

తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు" అని ఆయన చెప్పెను (యెహా 14:6).

**II. సంఘమునకు క్రీస్తు యొక్క ప్రశంస, ఆశీర్వాదములు (8-11వ).**

A. ఫిలదెల్ఫియ సంఘానికి క్రీస్తు తలుపు తెరిచి యుంచారు. దానిని ఎవడును వేయనేరడు.

1. అపో.కా. 14:27లో అన్యజనులకు దేవుడు తెరచిన విశ్వాస ద్వారమును గూర్చి చెబుతాడు.

2. కార్యానుకూలమైన గొప్ప ద్వారము తనకు తెరువబడి యున్నదని I కొరింథీ 16:9లో పౌలు చెబుతాడు.

3. త్రోయకు వచ్చినప్పుడు సువార్త ప్రకటించుటకు దేవుడు పౌలుకు మంచి ద్వారము తెరిచెను (II కొరింథీ 2:12).

B. ఆ తలుపు యేమిటి? అది సువార్త ప్రకటించుటకు దొరికిన మంచి తరుణము, గ్రీకు భాషను, సంస్కృతిని విస్తరింపజేయడానికే ఫిలదెల్ఫియ పట్టణం నిర్మించబడెను గదా. సువార్త ప్రకటించడానికి అది ఎంత గొప్ప తరుణమో. నిజముగా అది తెరువబడిన ద్వారమే.

C. వారికున్న శక్తి కొంచెమేయని క్రీస్తు ఎరుగును. వారి సంఖ్య స్వల్పమే, ధనం,పలుకుబడిస్వల్పమే అయ్యుండ వచ్చును. చిన్నసంఘమే అయినను దీవించబడునని, క్రీస్తుదానిని తన కొరకు వినియోగించుకొనునని ఇక్కడ మనకు బోధించుచున్నారు. ఆయనకు ఇష్టపూర్వకముగా జీవించుటే దీని రహస్యము.

1. వారికున్న శక్తి స్వల్పమే అయినను వారు దేవుని వాక్యమును గైకొని ఆయన నామమును ఎరుగననలేదు. "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" అని క్రీస్తు చెప్పెను (యోహాను 14:15,21,23). మనం వాక్య ప్రకారము ప్రవర్తింపనివారమైతే మనలను మనమే మోసపుచ్చుకొందుము (యాకోబు 1:22).

2. వారు ఆయన నామమును ఎరుగననలేదు. ఆయననామమును ధరించారు (I పేతురు 4:16). సమస్తము క్రీస్తునామముననే వారు చేసారు (కొలస్స 3:17).

D. ఆయన సాతాను సమాజపు వారిని గూర్చి చెప్పారు (9వ) వారు యూదులు కాకయే యూదులమని చెప్పుకొను చున్నారు. వారు అబద్ధము

లాడుచు యుండిరి. నిజమైన యూదులు దేవుని ప్రజలు. వారు దేవుని ఇశ్రాయేలు (గలతీ 6:16). హృదయమందు సున్నతిపొందిన వాడే నిజమైన యూదుడు (రోమా 2:28-29). యూదులమని చెప్పుకొను వీరు క్రీస్తు సంఘ శత్రువులు, అపవాదికి మిత్రులు, వారు వచ్చి నీ పాదములయెదుట పడి నమస్కారము చేయునట్లు చేతునని క్రీస్తు వారికి వాగ్దానము చేసెను. క్రీస్తు ఫిలదెల్ఫియ సంఘమును ప్రేమించినట్లు దీనిని బట్టివారు తెలిసికొందురు.

E. 10వ వచనములో క్రీస్తు ఒక వాగ్దానము చేసారు, వారు "ఓర్పు విషయమైన వాక్యమును గైకొనినందున" క్రీస్తువారిని ప్రశంసించారు. వారు విసుగక, సహనముగలిగి యుండాలని చెప్పుచున్న వాక్యమును బట్టినడుచు కొనిరి (హెబ్రీ 12:1-4;గలతీ 6:9; మత్తయి 24:13; ప్రకటన 2:10). వారు సహనము గలిగి యున్నారు గనుక రాబోవు శోధన కాలములో క్రీస్తువారిని కాపాడెదనని వాగ్దానము చేసారు. భక్తులను శోధనలో నుండి తప్పించుటకు ఆయన సమర్థుడు (2కొరింథీ 10:13; 2 పేతురు 2:9). క్రైస్తవులకు శోధనలు రావని బైబిలు బోధించుట లేదు. గాని శోధన జయించుటకు ఆయన తగిన శక్తినిచ్చును. శోధనలో నిలిచినవాడు జీవకిరీటము పొందును (యాకోబు 1:2-3,12).

F. 11వ వచనములో "నేను త్వరగా వచ్చుచున్నాననే" హెచ్చరికచేసారు. నీకు కలిగిన దానిని గట్టిగా పట్టుకొనుము" వారి ప్రత్యేకతను వారు కాపాడు కోవాలి (I థెస్స 5:21). వారిని గూర్చి అంతామంచే చెప్పబడింది. వారి కిరీటమును ఎవడును అపహరింపకుండా చూచు కోవాలి. అది జీవకిరీటము, నీతి కిరీటము అని చెప్పబడింది (ప్రకటన 2:10;2 తిమో 4:8). ఏశావు తన కిరీటమును యాకోబుకు కోల్పోయాడు; యూదులు అన్యజనులకు తమ కిరీటమును కోల్పోయారు. మనం కృపనుండి పడిపోగలము (2 పేతురు 2:20-22;హెబ్రీ 4:4-6).

## III. ప్రతిఫల వాగ్దానము (12వ)

A. జయించువానికి బహుమతి

వాగ్దానము చేయబడింది.

B. జయించువానిని ఆలయములో స్తంభముగా చేతునని యేసు వాగ్దానము చేసారు. ఫిలదెల్ఫియలో విగ్రహారాధన చేయుగుడులలో ఒకడు నమ్మకముగా యాజకుని పనిచేస్తే అతనిపేరున స్తంభాన్ని నిర్మించేవారు. దానిపై అతని గూర్చి వ్రాసేవారు. క్రైస్తవులు నిజదేవుని యాజకులు (2 పేతురు 2:3). క్రీస్తుసంఘమే దేవుని ఆలయము. అదొక గుడికాదు (I కొరింధీ 3:16, I పేతురు 2:5). పరలోకములో దేవాలయం యేదీ వుండదు (ప్రక 21:22). దేవుడు నమ్మకముగా యున్నవానిని ఘనపరచును.

C. అట్టివాడు ఇకమీదట ఎన్నటికి వెలుపలికిపోడు! ఫిలదెల్ఫియలో తరుచుసంభవించు భూకంపములకు ప్రజలు భయంతో బయటికి పోయేవారు. జయించు వానికి క్రీస్తు గొప్పభద్రతను ఈ రీతిగా వాగ్దానం చేసారు. పరలోకంలో ఏ భయమూ ఉండదు.

D. "మరియు నా దేవుని పేరును, నాదేవుని యొద్దనుండి దిగి వచ్చుచున్న నూతన యెరూలేషమను నా దేవుని పట్టణ పేరును, నా క్రొత్తపేరును వాని మీద వ్రాసెదను". క్రీ॥శ 17లో సంభవించిన భూకంపములో ఫిలదెల్ఫియ నాశనమాయెను. తిబెరియ కైసరు దానిని తిరిగి కట్టించి, "నీరోకైసరయ" అని నామకరణం చేసెను. క్రీస్తు ద్వారా దేవుడు మన జీవితాలను తిరిగి నిర్మించారు. ఆయన పేరు (క్రైస్తవుడు) మనకు పెట్టారు. మనం ఆయన సొత్తు. ఆయన మనవాడు మనం ఆయన వారము.

**ముగింపు:**

క్రీస్తు పరిశుద్ధుడు, యదార్ధవంతుడు, సర్వాధికారి. చిన్నవైనా నమ్మకముగా యున్న సంఘాలకు క్రీస్తు సువార్త ద్వారములు తెరుస్తారు. దేవునికి ఘనత తెచ్చువారిగ సంఘములు జీవించాలి. క్రీస్తునామాన్ని దేవుని వాక్యాన్ని గట్టిగా పట్టుకొంటే దేవుడు హర్షిస్తారు. అజాగ్రత్తగా యుంటే క్రైస్తవులు తమ కిరీటాన్ని కోల్పోతారు. నమ్మకముగా యుంటే ఘనత, నిత్యత్వ భద్రత, దేవుని వారమనే ప్రశంస వాగ్దానం చేయబడింది.

-జాన్ స్టేసీ

# వెలుగు సంబంధులు

(Children of Light)

నేరస్థులు తప్ప చీకటిని ప్రేమించే వారుండరు. చీకటిలో మనం యేమీ చేయలేము. కడు నేరస్థులను అధికారులు కటిక చీకటికొట్లలో బంధిస్తారు. దేవునిపై తిరుగుబాటు చేసిన దేవదూతలను ఆయన కటిక చీకటిలో బంధించి భద్రము చేసారు (యూదా:6). మాట విననొల్లని ఫరోకు బుద్ధి చెప్పుటకై దేవుడు ఐగుప్తునంతటిని మూడు దినముల మట్టుకు చీకటిమయంచేసెను (నిర్గమ 10:22). అంధకార సంబంధులగు లోకనాధులతో పోరాడు నిమిత్తము మనము దేవుని సర్వాంగ కవచమును ధరించుకొనాలని అపొ. పౌలు హెచ్చరించాడు (ఎఫెసీ 6:12). దుష్టత్వానికి, పాపానికీ, దు:ఖానికి, మరణానికి చీకటి సాదృశ్యము.

దేవుడుసృష్టి జరిగింపకముందు "భూమి నిరాకారముగాను, శూన్యముగాను ఉండెను; చీకటి అగాధ జలముపైన కమ్మియుండెను" "దేవుడు వెలుగు కమ్మని పలుకగా వెలుగుకలిగెను" (ఆది.కా. 1:2-3). భూమిపై దేవుడు ప్రాణకోటిని సృష్టించకమునుపు ఆయన వెలుగును చేసెను. ఏలయనగా వెలుగు లేనియెడల భూమిపై జీవరాసుల మనుగడ అసాధ్యము. జంతువులన్నియు పచ్చికపై ఆధారపడి జీవిస్తాయి. పచ్చిక కొరకు సూర్యరశ్మి వెలుగు అత్యవసరం.

ఈ లోకము ఆత్మీయాంధకారములో యున్నది. "దేవుడు వెలుగై యున్నాడు; ఆయన యందు చీకటి ఎంత మాత్రమును లేదు" (I యోహాను 1:5). "సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వము గలవాడై యున్నాడు" (I తిమోతి 6:16). "యెహోవానాకు వెలుగును రక్షణయునై యున్నాడు, నేను ఎవరికి భయపడుదును?" అని కీర్తనకారుడు వ్రాసాడు (కీర్త 27:1).

"యేసు - నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు కలిగియుండునని చెప్పెను"(యోహాను 8:12). "ఆయనలో జీవముండెను; ఆ జీవము మనుష్యులకు వెలుగై యుండెను. ఆ వెలుగుచీకటిలో ప్రకాశించుచుండెను గాని చీకటి దాని

గ్రహింపకుండెను" అని చెప్పబడి యున్నది (యోహాను 1:4-5). యేసే నిజమైన వెలుగు. ఆయన లేకుండా వెలుగైయున్న దేవుని మనం చేరలేము. ఆయన ఈ లోకములో తన పరిచర్యను ప్రారంభించినప్పుడు "చీకటిలో కూర్చుండి యున్న ప్రజలును గొప్ప వెలుగు చూచిరి. మరణ ప్రదేశములోను మరణచ్ఛాయలోను కూర్చుండి యున్న వారికి వెలుగు ఉదయించెను" (మత్త 4:16). దేవుని వాక్యము మనపాదములకు దీపమును, మన త్రోవకు వెలుగునై యున్నది (కీర్త 119:105).

"మీరు లోకమునకు వెలుగై యున్నారని" యేసు తన శిష్యులకు ఉద్బోధించెను (మత్త 5:14). క్రీస్తులో యుండి ఆయన పిల్లలతో సహవాసము గలవారు ఈ లోకములో జ్యోతులవలె యుందురు. వెలుగును మరుగు పరచలేము. వెలుగుబయలు పరచును. మనం ఈ లోకమునకు వెలుగై యున్నామని ఎట్లెరుగుదుము? అపొ.పౌలు ఇట్లు జవాబిచ్చుచున్నాడు. "మీరు పూర్వమందు చీకటియై యుంటిరి. ఇప్పుడైతే ప్రభువు నందు వెలుగైయున్నారు. వెలుగు ఫలము సమస్తవిధములైన మంచితనము నీతి సత్యమును వాటిలో కనబడుచున్నది" (ఎఫెసీ 5:8-9). మన జీతంలో వెలుగు ఫలముంటే, మనం ఈ లోకానికి వెలుగైయున్నాము.

మన దేవుడు మంచివాడు. యెహోవా ఉత్తముడని రుచిచూచి తెలిసికొనుడి. ఆయనను ఆశ్రయించు నరుడు ధన్యుడు (కీర్తన 34:8). "ఆయన నీతిని న్యాయమును ప్రేమించుచున్నాడు. లోకము యెహోవా కృపతోనిండి యున్నది" (కీర్తన 33:5). ఆయన మంచితనాన్ని మనం ఈ లోకములో పంచాలి. ఆయన కృపగలవాడు, దయాదాక్షిణ్యపూర్ణుడు. శ్రేష్ఠమైన ప్రతి యీవిని, సంపూర్ణమైన ప్రతివరమును ఆయన మనకనుగ్రహించియున్నారు. ఆయన మేలు చేయుచు సంచరించెను (అపొ.కా. 10:38). మనం మంచి తండ్రియైన దేవుని బిడ్డలుగా యుండాలంటే ఆయనకు లోబడుచు జీవించాలి. ఏలయనగా "దేవుడు ముందుగా సిద్ధపరచిన సత్క్రియలు చేయుటకై మనము క్రీస్తు యేసునందు సృష్టింపబడినవారమై ఆయన చేసిన పనియైయున్నాము"(ఎఫె 2:10). "వెలుగులో ఉన్నానని చెప్పుకొనుచు తన

సహోదరుని ద్వేషించువాడు ఇప్పటి వరకును చీకటిలోనే యున్నాడు. తన సహోదరుని ప్రేమించువాడు వెలుగులో ఉన్నవాడు; అతనియందు అభ్యంతర కారణమేదియు లేదు" (I యోహా 2:9-10).

మన దేవుడు నీతిమంతుడు (కీర్త 119:137). ఆయనవాక్యమును బట్టి నడుచుకొనువారాయన దృష్టిలో నీతిమంతులు. నీతిమంతులకొరకు ఆయన కనుదృష్టి లోకమందంతటా సంచరించుచున్నది. నోవాహు కాలము నాటి దుష్టజనాంగమును ఆయన నాశనము చేసెను. గాని నీతిమంతుడైన నోవహును అతని కుటుంబమును ఆయన రక్షించెను.

దేవునివాక్యము నీతియైయున్నది. ఆయన ఆజ్ఞలన్నియు న్యాయములు (కీర్తన 119:172). దేవుని వెంబడించు వారు ఆయన దృష్టిలో నీతిమంతులు.

"మీరు లోకమునకు వెలుగై యున్నారు.... మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింప నీయుడి" యని యేసు తన శిష్యులకు చెప్పెను (మత్తయి 5:14-16). కుంచము క్రింద పెట్టబడిన దీపము ఆక్సిజన్ లేనందున త్వరలో ఆరిపోవును. మంచితనము, నీతియును వాటిని మరుగుచేయలేము. "ప్రత్యక్షపరచునది ఏదో అది వెలుగే గదా"(ఎఫెసీ 5:13).

మనం సత్యములో యుండి, నీతి గలిగి జీవిస్తే ఈలోకమునకు వెలుగైయుందుము. సూర్యుడు పలువిధములైన వాయువులను మండించుట ద్వారా వెలుగిచ్చును. ఇంకోమాటలో శక్తిని (Energy) మండించుట ద్వారా వెలుగు పుట్టును. మనం దేవుని వాక్యము ప్రార్థన సహవాసము ఆరాధనల ద్వారా శక్తిని పొందుదుము.

మనం ఈ లోకమునకు వెలుగై యుండకపోతే, తేజస్సులో నివసించు దేవుని సమీపించలేము. "అందుచేత నిద్రించుచున్న నీవు మేల్కొని మృతులలోనుండి లెమ్ము, క్రీస్తు నీ మీద ప్రకాశించుచున్నానని ఆయన చెప్పుచున్నాడు"(ఎఫెసీ 5:14).

"నీకు వెలుగు వచ్చియున్నది, లెమ్ము తేజరిల్లుము. యెహోవా మహిమ నీ మీద ఉదయించెను" (యెష 60:1).

**- కవితా గూటం**

# యదార్థమైన ఆరాధన

(True worship)

"రండి నమస్కారము చేసిసాగిల పడుదము, మనలను సృజించిన యెహోవా సన్నిధిని మోకరించుదము" (కీర్త 95:6). దేవుని మహిమ పర్చుటే ఆరాధన యొక్క ముఖ్యోద్దేశము. మనసృష్టి కర్త యెడల భక్తిని ప్రదర్శించు ఒక క్రియ అది. దేవునికి అంగీకార యోగ్యముగా ఆరాధించుట తేలికయైన పని కాదు. యదార్ధ ఆరాధన చేయు కొన్ని సంగతులను మీకు తెలియజేయ గోర్తాను.

దేవుని యెడల మన కృతజ్ఞత భావాన్ని ఆరాధన మరింత లోతుగా ప్రకటింపజేస్తాది. మన అవసరాలను, బలహీనతలను గూర్చి మనకు తెలియజేస్తాది. కొన్ని మత శాఖల సంఘాలు ఆరాధన సమయానికి గంటలు మ్రోగిస్తారు. ఆ గంటల శబ్దము ద్వారా తమ సభ్యులను పిలుస్తారు. క్రైస్తవుల వలె మనం ఆరాధనకు మరి ఉన్నత పిలుపును పొందియు[illegible]ము. సైన్యముల కధిపతియైన యెహోవాను చూచిన తరువాత యెషయా, "అయ్యో అపవిత్రమైన పెదవులు గలవాడను; నేను నశించితిని; రాజును సైన్యముల కధిపతియైన యెహోవాను నేను కన్నులార చూచితిననుకొంటిని" యని చెప్పాడు (యెషయా 6:5).

మనం దేవుని ఆత్మతోను సత్యముతోను ఆరాధించునప్పుడు మన మనోభావములు ఉన్నత స్థాయికి చేరుకొనును. దేవుని యెడల, నశించిన వారి యెడల ప్రేమ అధికమగును. సత్యము మనలను స్వతంత్రులనుగా చేయును. ఆరాధించుచుండగా దేవుడు చేసిన మేళ్లన్నిటిని జ్ఞప్తికి తెచ్చుకొందుము. ప్రభురాత్రి భోజనంలో పాలుపొందుచుండగా మనం గతాన్ని, ప్రస్తుతాన్ని, భవిష్యత్తును కూడా జ్ఞప్తికి తెచ్చుకొంటాము. క్రీస్తు సిలువను, మరణాన్ని తలంచుకొంటాము. ఆయన

రక్తములో యున్న శక్తిని, శుద్ధి చేయబడుచు యుండే మన అవసరాన్ని గుర్తుంచుకొంటాము.

దైనందిన సాధక బాధ కములనుండి ఆరాధనలో విడుదల మనకు లభించును. ఆరాధించిన తరువాత మనం బలం పొందుతాము, పునరుజ్జీ వింపజేయబడతాము. "మనలను ప్రేమించిన వాని ద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము"(రోమా 8:37). "కాబట్టి యిప్పుడు క్రీస్తుయేసు నందున్న వారికి ఏ శిక్షావిధియు లేదు. క్రీసుయేసు నందు జీవమునిచ్చు ఆత్మ యొక్క నియమము పాప మరణముల నియమము నుండి నన్ను విడిపించెను (రోమా 8:1-2).

ఆరాధనలో మనం దేవుని గూర్చి లోతుగా తెలిసికొనే తరుణం లభించును. దేవుని వాక్యాన్ని వినుట ద్వారా మన విశ్వాసం బలపర్చబడును (రోమా 10:17). దేవుని వాక్యాన్ని నిర్మలమైన హృదయంతో అంగీకరించినప్పుడు మన చింతలన్నీ తీరిపోవును. "ఆయన త్రోవలో మనతో మాటలాడుచు లేఖనములను మనకు బోధపరచు చున్నప్పుడు మన హృదయము మనలో మండ లేదా అని యొకనితో ఒకడు చెప్పుకొనిరి" (లూకా 24:32).

ఆరాధన మనలను దేవుని సన్నిధానమునకు నడిపించును. "ఇద్దరు ముగ్గురు నానామమున ఎక్కడ కూడి యుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందునని" ప్రభువు చెప్పెను (మత్తయి 18:20). ఆరాధనలో మనం దేవునికి సన్నిహిత మవుతాము. దేవుని వాగ్దానములలో మన నమ్మిక మరింత స్థిరపడును. "ఆనందముగా యింపైన కానాన్ యేగెదన్. పరిశుద్ధ తండ్రి మోమున్ దర్శించెదన్" అని యదార్థముగా ఆరాధించే వారే పాడగలరు!

–చార్ల్స్ కర్టిస్

## బైబిలు ప్రశ్నోత్తరి

1. సొలుమోనుకు ఒక ద్రాక్షవనము ఎక్కడ కలదు?
2. రాత్రివేళ గంపలో ఉంచి గోడగుండ క్రిందికి దింపినది ఎవరిని?
3. ఒక దేశమందు యోబు కుమార్తెలంత సౌందర్యవంతులు కనబడలేదు. ఆ దేశం పేరేమి?
4. విస్తారముగా వ్యాపించిన ద్రాక్షచెట్టుతో సమానము ఎవరు?
5. మొదటిగా వ్యవసాయము చేయ నారంభించినది ఎవరు?
6. కుమారుడు దుర్మార్గముగా ప్రవర్తించుటకు నేర్పుచు వచ్చిన తల్లి ఎవరు?
7. ప్రభువునకు నమ్మకమైన పరిచారకుడు ఎవరు?
8. యెహోవా నామమున ప్రార్థన చేయుట ఎప్పుడు ఆరంభమైనది?
9. మోషే యొక్క భార్య పేరేమి?
10. అబ్రాహాము అన్నిటిలో పదియవవంతు ఎవరికి ఇచ్చెను?
11. సత్యమునకు స్తంభమును ఆధారమువై ఉన్నది ఏది?
12. ఫిలిప్పు ఏ పట్టణపు కాపురస్థుడు?
13. యెహోవా యందు భయభక్తులు గలవారు ఒకరితో ఒకరు మాట్లాడుకొనుచుండగా చెవియొగ్గి ఆలకించినది ఎవరు?
14. శృంగార దేవాలయము ద్వారము దగ్గర కుంటివాడై కూర్చుండిన వాని వయస్సు ఎంత?

**సమాధానములు:**

1. బయలు హామోను నందు పరమగీతం 8:11. 2. పౌలును అపొస్త 9:25. 3. ఊజు దేశం యోబు 42:15. 4. ఇశ్రాయేలు హోషేయా 10:1. 5. నోవహు ఆది 9:20. 6. అతల్యా 1దినవృ 22:2,3. 7. తుకికు ఎఫెసి 6:21. 8. ఎనోషు పుట్టినప్పుడు ఆది. 4:26. 9. సిప్పోరా నిర్గమ 2:21. 10. మెల్కీసెదెకు హెబ్రీ 7:3. 11. సంఘము 1 తిమోతి 3:15. 12 బేత్సయిదా యోహాను 2:44. 13. యెహోవా మలాకి 3:16. 14. 40 ఏండ్లు అపొస్త 4:22.

– బ్రదర్ యోహాను, కురెళ్లగూడెం.

## సంక్షిప్త వార్తలు

2006 డిశంబరు 30వ తేదీనాడు వాడపర్రులో జరిగిన సువార్తకూటములో రిక్కీ గారు, కైల్ ఏలెన్ గారు వాక్యపరిచర్య చేసిరి. నలుగురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

2007 జనవరి 10వ తేదీ బుధవారం నాడు హైదరాబద్‌లో జరిగిన గొప్ప బహిరంగ సంభలో సోదరులు జాషువా గూటం గారికి ఆయన రేడియో, T.V లలో చేయుచున్న పరిచర్యలనిమిత్తము ఒక అవార్డు అందజేయబడినది. ఆ సభను సోనిక్ విజన్స్ అను ప్రైవేటు మల్టీ మీడియా సంస్థవారు హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లో, హుసేన్‌సాగర్ తీరాన ఏర్పాటు చేసిరి, వేలాది ప్రజలు హాజరైరి. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకరు గౌ॥ సురేష్ రెడ్డి గారి చేతుల మీదుగా ఆ అవార్డును జాషువా గారికి, తదితర టి.వి. వక్తలకు అందజేసిరి. నాటి సభలో మంత్రి మారెప్పగారు, స్పీకర్ సురేశ్ రెడ్డి గారు, పలు రాజకీయ, మతనాయకులు, ముఖ్యమంత్రి గౌ॥ Y.S. రాజశేఖర్ రెడ్డి గారి సతీమణి, కుమార్తె, అల్లుడు అనిల్ కుమార్, సినీనటి జయసుధ గార్లు హాజరైరి. అనిల్ గారు వాక్యపరిచర్య చేసిరి. ఆ కార్యక్రమమునంతా హైదరాబాద్ సికింద్రాబాద్‌లలో లైవ్ టెలికాస్ట్ చేసిరి. తదుపరి కొన్ని తెలుగు ఛానళ్లలోను కూడ ప్రదర్శించిరి. జాషువా గారికి ఈ అవార్డు ఇచ్చుటలో ఆంధ్రప్రదేశ్‌లో క్రీస్తుసంఘములు చేయుచున్న పరిచర్య గుర్తించబడినందుకు దేవుని నామము మహిమ పరచబడినందుకు ఆయనను స్తుతించుదాం.

2007 ఫిబ్రవరి 2వ తేదీ శుక్రవారం రాజోలు మండలం మాకనపాలెంలో జాషువా గూటం, రోయస్ ఫ్రెడరిక్ గార్ల సహాయ సహారములతో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయము ప్రభువు పని కొరకు ప్రతిష్ట చేయబడినది. పలువురు స్థానికులు, సంఘ సభ్యులు హాజరైరి. సోదరులు R.Ch. సద్గుణరావ్ (శ్రీకాకుళం) గారు వాక్య పరిచర్య చేసిరి. అక్కడ కుసుమ ఐజక్ గారు సువార్త చాటుచున్నారు.

2007 ఫిబ్రవరి 3వ తేదీనాడు తాళ్లరేవు సీతారాంపురంలో జరిగిన సువార్త కూటములో సోదరులు జాషువా గూటం, R.Ch. సద్గుణరావ్ గార్లు హాజరై వాక్య పరిచర్య చేసిరి. అక్కడ సోదరులు జాన్ విక్టర్ గారు సువార్త పరిచర్య చేయుచున్నారు. అదేరోజు మధ్యాహ్నం అనపర్తి మండలం పొలమూరులో నిర్మించబడిన క్రీస్తుసంఘ ఆలయమును సోదరులు జాషువా గూటం గారు రిబ్బను కత్తిరించి ప్రతిష్టించిరి. సోదరులు R.Ch. సద్గుణరావ్ గారు వాక్యపరిచర్య చేసిరి. ముగ్గురు క్రీస్తులో ప్రవేశించుటకు నిశ్చయించుకొనిరి. పొలమూరులో సోదరులు కె.జయానందంగారు చాలా కాలముగా వాక్యపరిచర్య చేయుచున్నారు.

జనవరి ఆఖరి వారంలో రిక్కీగారు న్యూఢిల్లీ, అమృతసర్, చండీగర్ ప్రాంతాలలో వాక్యపరిచర్య చేయుటకై అక్కడికి వెళ్లి యిది ముద్రించుసరికి అక్కడే పరిచర్య చేయుచున్నారు.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004